# ఆఫీసర్లపై నజర్



ప్రభుత్వ శాఖల యంత్రాంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా

- కలెక్టర్లు ప్రజాక్షేత్రంలోకి వెళ్తున్నారా..? లేదా..? అని ఆరా
- కొన్ని జిల్లాల్లో ముఖ్య అధికారులపై అసంతృప్తి
- ప్రభుత్వ అధికారుల పనితీరుపై ఇంటెలిజెన్స్ దృష్టి
- పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందజేత
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఐఏఎస్‌లపై ఫిర్యాదులు
- త్వరలో పలువురు కలెక్టర్లు, అధికారుల బదిలీలు జరిగే అవకాశం
- ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు కసరత్తు

7

కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారుల పనితీరుపై ప్రభుత్వం దృష్టి సారించింది. వారి నడవడిక, చేసిన పనులు, వ్యవహారాలపై కూపీ లాగుతోంది. అలాగే మొత్తం ప్రభుత్వ శాఖల పనివిధానాన్ని పరిశీలిస్తోంది. వారు కార్యాలయాల్లో, బయట వ్యవహరిస్తున్న తీరును నిశితంగా గమనిస్తోంది. మూడు నెలలుగా ఇంటెలిజెన్స్ వ్యవస్థ దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు ఐఏఎస్ అధికారులు, శాఖల ముఖ్య అధికారులపై ఇప్పటికే ఇంటెలిజెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. కొన్ని నెలలుగా పలువురు కలెక్టర్లు, ముఖ్య అధికారుల పనితీరుపై ప్రజలు, పార్టీ నాయకుల నుంచి పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో సర్కారు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఏ అధికారి ఏంచేస్తున్నారు..? ఏఏ పనుల్లో అక్రమాలు జరిగాయి..? అనే అంశాలను పరిశీలిస్తోంది. విచారణ చేయాలని ఇంటెలిజెన్స్‌ను రంగంలోకి దింపింది. వారిపై నివేదికను కోరింది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు కలెక్టర్లపై ప్రభుత్వం చర్యలకు దిగనుందని సమాచారం. అలాగే పలువురు ఉన్నతాధికారులపై వేటు పడనుందని తెలుస్తోంది. కాగా, చట్టాన్ని కాపాడడంతోపాటు, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసుల తీరుపై కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. వరంగల్ పోలీసు కమిషనరేట్ ఈస్ట్ డివిజన్‌లో పలువురు పోలీసు అధికారులపై వేటు పడనుందనేది తెలుస్తోంది. ఇటీవలే యేడాది పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలకు చేరువయ్యేందుకు మరింత ముందుకెళుతోంది. ఈ క్రమంలోనే అధికార యంత్రాంగాన్ని సరిదిద్దే చర్యలకు పూనుకున్నట్లు తెలుస్తోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



జనగామ లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోకి వెళుతున్న అభ్యర్థులు

# ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

## 53 శాతం విద్యార్థుల హాజరు

- పరీక్షా కేంద్రం తెలియక గిరిజన అభ్యర్థిని వెనక్కి

జనగామ కల్చరల్, డిసెంబరు 15 : టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో ఓ మహిళా అభ్యర్థి పరీక్షకు హాజరు కాలేకపోయారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా 9 గంటల నుంచి మందకోడిగా అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. హ్యాండ్ వాచ్, ఇతర ఆభరణాలతో సహా వేటినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. ఉదయం సెషన్‌లో పేపర్-1 పరీక్షకు 5470 మంది అభ్యర్థులకు గాను 2519 మంది గైర్హాజరు కాగా 2951 మంది హాజరయ్యారు. మొత్తం మీద 54.10 శాతం మంది హాజరు నమోదైంది. మధ్యాహ్నం సెషన్ లో 5470 మందికి గాను 2533 మంది గైర్హాజరు కాగా 2937 మందితో 53.88% మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

### గిరిజన బాలింత అభ్యర్థికి అన్యాయం ..

అధికారుల నిర్లక్ష్యంతో ఓ గిరిజన బాలింత అభ్యర్థి పరీక్షకు హాజరు కాలేక పోయారు. జిల్లా లోని కొడకండ్ల మండలం వాస్యా తండాకు చెందిన భూక్యా సునీత అనే బాలింత అభ్యర్థి గ్రూప్-2 పరీక్షలు రాస్తోంది. ఈ మేరకు ఆదివారం జనగామ పట్టణంలో పక్కపక్కనే ఉన్న రెండు పరీక్షా కేంద్రాలలో ఒకటైన సెయింట్ మేరీస్ పరీక్షా కేంద్రంలోకి అరగంట ముందుగానే వెళ్లింది. గేటు దగ్గర ఉన్న అధికారులు హాల్‌టికెట్‌ను పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన అభ్యర్థి ఓఎంఆర్ షీటు బయోమెట్రిక్ సమయంలో అభ్యర్థికి సంబందించిన పరీక్షా కేంద్రం ఇది కాదని, పక్కనే ఉన్న సాన్ మారియా పాఠశాల పరీక్షా కేంద్రంగా అధికారులు గుర్తించారు. వెంటనే పక్కనే ఉన్న సాన్‌మారియా స్కూల్ పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన అభ్యర్థికి సమయం దాటి పోవడంతో అధికారులు అనుమతించలేదు. ఇప్పటికే మరో పరీక్షా కేంద్రంలో ఉన్నానని తన ఆవేదనను వ్యక్తం చేసినప్పటికీ అధికారులు నిబంధనల నెపంతో అనుమతించకపోవడంతో అభ్యర్థి తన చిన్న పాపతో పరీక్షా కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేసింది. ఇటీవల గ్రూప్స్ కాంపిటీటివ్ పరీక్షల్లో జరిగిన అవకతవకల నేపథ్యంలో టీజీపీఎస్సీ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఈ ఏర్పాట్లే అభ్యర్థుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. మహిళలకు చెందిన ఆభరణాలు (మంగళసూత్రాలతోపాటు) తొలగించడం, పురుషులకు సంబంధించిన బూట్లు, చేతి కంకణాలు సైతం తొలగించడం, దివ్యాంగుల వాహనాన్ని పరీక్షా కేంద్రానికి 100 మీటర్ల దూరంగా పెట్టి పరీక్షా కేంద్రంలోకి వెళ్లడం లాంటి సంఘటనలు వారి అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. నిబంధనల నెపంతో అధికారులు అతిగా ప్రవర్తిస్తుండడంతో అభ్యర్థులు తమకు లేక లేక వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రూప్-2 పరీక్షల ఆర్‌సీవో ఆసంపల్లి నర్సయ్యను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.



పరీక్షా కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బాలింత భూక్యా సునీత



జనగామలోని ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



జనగామలోని ఎస్‌ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో రూం నంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు



సోమనాథుడి స్మృతి వనం వద్ద ప్రముఖ కవి లక్ష్మీనారాయణ, పక్కన డాక్టర్ సత్యనారాయణ

## తెలుగు వర్సిటీకి పాల్కూరికి పేరు పెట్టాలి

పాలకుర్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీకి బసవ పురాణం గ్రంథకర్త పాల్కూరికి పేరుపెట్టాలని ప్రముఖ కవి సబ్బని లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండల ంలోని పాలకుర్తిలోని పాల్కూరికి సోమ నాథుడు, బమ్మెర,లో పోతన స్మారక మందిరం, గూడూరులో శాసనాలను సందర్శించి పరిశీలించారు.కార్యక్రమంలో అనిల్ శివాచార్య, సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ , మేరుగు మధు, లెనిన్ ఉన్నారు.



మీదికొండ రేణుక ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

# తెలంగాణకు ప్రతీకలుగా నిలుస్తున్న గ్రామ దేవతలు

**స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా గ్రామ దేవతల పండుగలు నిలుస్తున్నాయని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. మండలంలోని మీదికొండ గ్రామంలో ఆదివారం జరుగుతున్న రేణుక ఎల్లమ్మ, కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని రేణుక ఎల్లమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గౌడ కులస్తులు కడియంకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుందన్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి దీవెనలతో రానున్న రోజుల్లో గ్రామస్తులు పాడిపంటలు, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. గౌడ కులస్తుల కోరికమేరకు ఆలయ అభివృద్ధికి తన వంతుగా రూ.5లక్షల ఆర్థికసాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ అంజయ్య, వెంకటయ్య, కత్తి శ్రీను, బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, జిల్లా నాయకుడు రాపోలు మధుసూదన్ రెడ్డి, సూదుల రత్నాకర్‌రెడ్డి, బూర్ల శంకర్, ఎన్. యాదగిరి, నాయకులు ఎదునూరి రాజు, చాడ రాజ్‌కుమార్, సానాది రాజు, జోగు కుమార్, చెరుకు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామికి నిలువెత్తు తులాభారం చేస్తున్న భక్తుడు

# సోమేశ్వర స్వామికి నిలువెత్తు తులాభారం

పాలకుర్తి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో హైదరాబాద్‌కు చెందిన పబ్బ సోమయ్య అనే భక్తుడు ఆదివారం చిల్లర నాణేలతో నిలువెత్తు తులాభారం సమర్పించి మొక్కులు చెల్లించాడు. ఈ సందర్భంగా భక్తుడు సోమయ్య మాట్లాడుతూ కరోనా కాలంలో తాను అనారోగ్యానికి గురయ్యానని, ఆ సమయంలో శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నిలువెత్తు తులాభారం చేస్తామని మొక్కుకున్నట్లు తెలిపారు. కొద్ది రోజుల తర్వాత ఆరోగ్యం పూర్తిగా నయమైందని తెలిపారు. అందుకే నిలువెత్తు 78 కేజీల రూ. 30 వేలు చిల్లర నాణాలను తులాభారం వేసిన నాణేలను హుండీలో వేసినట్లు తెలిపారు. ఆలయ ఈవో మోహన్ బాబు, ఆలయ సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్ కుమార్, నాగరాజు తదితరులు ఉన్నారు.

### ప్రత్యేకంగా మార్కెటింగ్ వ్యవస్థ

ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా ఉండే బడా కార్పొరేటు ఆస్పత్రులు తమకంటూ ప్రత్యేకంగా మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేది. వివిధ జబ్బులతో బాధపడేవారిని తమ వద్దకు రెఫర్ చేయాలంటూ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులను కోరేది. ఆస్పత్రుల మధ్య పోటీ పెరిగి ..చివరకు జిల్లా కేంద్రం నుంచి గ్రామాల వరకు మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ విస్తరించింది. చిన్నా పెద్ద, కొత్త, పాత అనే తేడా లేకుండా వ్యాధిగ్రస్తులను రెఫర్ చేసిన ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ఆకర్షణీయమైన ఆఫర్లు, ప్యాకేజీలను ప్రైవేటు ఆసుపత్రులు ప్రకటిస్తున్నాయి. ఆర్‌ఎంపీ, పీఎంపీలు పంపిన వారు ఇన్‌పేషంట్‌గా చేరితే ఆ రోగి చెల్లించే ఫీజులో 30 నుంచి 35 శాతం, వివిధ టెస్టులకు సంబంధించి వేసే బిల్లులో 50 శాతం వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం.



నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ మెడికల్ షాపు

# జోరుగా మెడికల్ దందా..!

- పల్లెలకు విస్తరించిన మార్కెటింగ్ వ్యవస్థ
- ఆర్‌ఎంపీ, పీఎంపీలకు ప్రైవేటు ఆస్పత్రుల ఆఫర్లు
- కమీషన్ల కోసం కొందరు అనైతిక పద్ధతులు
- స్థాయికి మించిన వైద్యంతో సామాన్యులకు ఇబ్బందులు

## షాపు ఒకరిది... నిర్వహణ మరొకరది

రఘునాథపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జ్వరం.. జలుబు.. తలనొప్పి ఇలా ఏదైనా ప్రజలు నేరుగా మెడికల్ షాపులకు వెళ్లి మందులు కొనుగోలు చేస్తున్నారు. డాక్టర్ ప్రిస్కిప్షన్, కనీసం ఫార్మసిస్ట్ లేకుండా మెడికల్ షపు యజమానులు మందులు అందజేస్తున్నారు. యాంటీ బయాటిక్స్‌తో పాటు రెండు, మూడు రకాల టాబ్లెట్లు ఇచ్చి ప్రజల అవసరాన్ని క్యాష్ చేసుకుంటున్నారు. మందులు వాడినా జబ్బు నయం కాకపోతే అప్పుడు వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రజలు నేరుగా కొనుగోలు చేస్తుండడంతో మెడికల్ షాపులు పుట్టగొడుగులుల్లా వెలుస్తున్నాయి. జిల్లాలో మెడికల్ మాఫియాకు అడ్డు అదుపులేకుండా పోయింది..అడ్డగోలుగా మెడికల్ దందా మూడు పువ్వులు..ఆరు కాయలుగా కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నపాటి జ్వరం నుంచి పెద్ద పెద్ద గాయాలైన వారికి సైతం స్థానిక ప్రైవేటు వైద్యులే చికిత్స చేసి తక్కువ ఖర్చుతో ప్రాణాలను కాపాడేవారు. అందుకే వారిని గ్రామీణ ప్రజలు దేవుడితో సమానంగా భావించేవారు. కానీ రానురాను ఆ పరిస్థితి మారిపోతుంది..పల్లెలు, మారుమూల గ్రామాలే కాకుండా పట్టణ ప్రాంతాల్లోని కొన్ని కాలనీలే లక్ష్యంగా చేసుకుని మెడికల్ మార్కెటింగ్ వ్యవస్థ మాఫియాలా మారిపోయింది. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో ఆర్‌ఎంపీ, పీఎంపీలను టార్గెట్‌గా చేసుకుని ఆఫర్ల తో మెడికల్ మాఫియా నిర్వాహకులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. ఈ ఆఫర్ల మైకంలో పడిన కొందరు ఆర్‌ఎంపీలు. పీఎంపీలు అడ్డదారులు తొక్కుతూ అనైతిక వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా సామాన్యులు ఆరోగ్యంతో పాటు డబ్బులు కూడా నష్టపోతున్నారు. స్థాయికి మించిన వైద్యం అందించడంతో సామాన్యులు కొద్దిరోజుల్లోనే మళ్లీ అనారోగ్యానికి గురవుతున్నారు. చికెన్‌గున్యా, డెంగ్యూ లాంటి వ్యాధులకు పాత పద్ధతిలోనే చికిత్సలు అందిస్తూ..ప్రైవేటు ఆసుపత్రులు నుంచి కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అడ్డగోలుగా అమ్మకాలు

జిల్లాలో 184 మెడికల్ షాపులు ఉన్నాయి. మెడికల్ దందా మూడు ఇంజెక్షన్లు..ఆరు టాబ్లెట్లుగా కొనసాగుతుంది. అన్ని దందాల్లోకెల్లా..మెడికల్ దందా లాభసాటిగా నడుస్తుంది. మెడికల్ షాపు నిర్వహించాలంటే నిబంధనల ప్రకారం ఫార్మసిస్టు తప్పకుండా షాపులో ఉండాలి. కానీ చాలా దుకాణాల్లో ఫార్మసిస్టులే లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. కొందరు వ్యాపారులు ఇతరుల సర్టిఫికెట్లను అద్దెకు తీసుకుని వారి పేరుతో మెడికల్ షాపులు నడుపుతున్నారు. వాస్తవానికి డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్మకూడదు. కానీ చాలా మెడికల్ షాపులల్లో నిబంధనలు పాటించకుండా అర్హత లేని వారు సైతం మందులను విక్రయించడం వల్ల ప్రజలకు నష్టం జరిగే ప్రమాదముందని తెలిసినా, మెడికల్ షాపుల నిర్వాహకులు పట్టించుకోక పోవడం విడ్డూరం. ప్రతీ చిన్న విషయానికి కూడా యాంటీబే టిక్ మందులు రాస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు. కొన్ని గ్రామాల్లోనైతే ఏకంగా ఆర్‌ఎంపీలే ఫార్మసిస్టుల అవతారం ఎత్తి మందులను విక్రయిస్తున్నారు. మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టులు ఒకరైతే అమ్మేవారు ఇంకొకరు ఉంటున్నారు. ఇంత జరుగుతున్నా మెడికల్ షాపుల్లో నిబంధనలు కూడా పాటించడం లేదు. కొన్ని గ్రామాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఇష్టారీతిన మందులు ఇవ్వడంతో ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితులు నెలకున్నాయి. కొన్ని మెడికల్ షాపులలో నిషేదిత మందులను కూడా విక్రయి స్తున్నారని ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. కొన్ని మెడికల్ షాపులలోనైతే డాక్టర్లు రాసిన ప్రిస్కిప్షన్ లేకుండానే మందులను వారి ఇష్టారాజ్య ంగా విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారుల కనుసన్నలో నే నడుస్తుందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఫోన్‌లో సంప్రదించగా అధికారులు అందుబాటులోకి రాలేదు. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు స్పందించి మెడికల్ షాపులతో పాటు అనుభవం లేని ఆర్‌ఎంపీ, పీఎంపీలపై తగు చర్యలు తీసుకుని సామాన్య ప్రజల ప్రాణాలను కాపాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

### ప్రథమ చికిత్స వరకే పరిమితం..

నిబంధనల ప్రకారం ఆర్‌ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స వరకు మాత్రమే పరిమితం కావాలి. సర్టిఫైడ్ డాక్టర్ సూచించిన ప్రిస్కిప్షన్ ఆధారంగా సెలెన్ పెట్టడం, మందులు ఇవ్వడం, ఇంజక్షన్ చేయడం వంటి సేవలు చేయాలి.నేరుగా పరీక్షించడం, రోగ నిర్ధారణ చేయడం, మందుల ఇవ్వడం చేయకూడదు. కానీ ఈ నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు.





వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

### నాణ్యమైన వస్త్రాలను

# తక్కువ ధరకే అందించాలి

- శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- వరంగల్‌లో వైభవలక్ష్మి షాపింగ్ మాల్ ప్రారంభం

వరంగల్ చౌరస్తా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత వ్యాపార రంగంలోకి రావాలని, నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరకే వినియోగదారులకు అందించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన వరంగల్ చౌరస్తాలో వైభవలక్ష్మి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత వ్యాపారంలో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగుల కన్నా మెరుగైన జీవనం గడుపవచ్చన్నారు. అనంతరం షాపింగ్ మాల్ నిర్వాహకులు మాట్లాడుతూ.. వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక పట్టు చీరలతో పాటు మెన్స్, కిడ్స్, ఎత్నిక్ వేర్ కౌంటర్స్ ఉన్నాయని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రతీ రూ.10 వేల కొనుగోలుపై ఉచితంగా బంగారు నాణెం అందిస్తామని, విద్యార్థులకు 10శాతం ప్రత్యేక రాయితీ ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు గందె కల్పన, పల్లం పద్మ, షాపింగ్ మాల్ యాజమానులు వర్రి లలిత్, ప్రదీప్ కుమార్ బజాజ్, సూరజ్‌సరడ, పి.హరీష్, పి.రిషిత తదితరులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ చూస్తే తల్లి మందలించిందని..

### గడ్డి మందు తాగి విద్యార్థి ఆత్మహత్య



శ్రావ్య (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ చూస్తుంటే తల్లి మందలించిచడంతో కూతురు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు కృష్ణకాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. టౌన్ హెడ్‌కానిస్టేబుల్ మన్సూర్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణకాలనీకి చెందిన ధరావత్ కవిత-వెంకన్న దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె శ్రావ్య (19) పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ ద్వితీయ సంవత్సరం కోర్సును అభ్యసిస్తోంది. ఈనెల 14న కళాశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న శ్రావ్య సెల్‌ఫోన్ చూస్తోంది. గమనించిన తల్లి కవిత ఎందుకు కాలేజీకి వెళ్లకుండా సెల్‌ఫోన్ చూస్తున్నావని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రావ్య శనివారం సాయంత్రం ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగింది. ఇది గమనించిన తల్లి కవిత చికిత్స నిమిత్తం ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. శ్రావ్య అక్కడే చికిత్సపొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందింది. తల్లి కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మన్సూర్ అలీ తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ హక్కు

### మాదిగ ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు

జనగామ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ హక్కు అని మాదిగ ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని వైఎస్ఎస్ఆర్ భవన్‌లో ఆదివారం గాదె సుధాకర్ అధ్యక్షతన మాదిగ ఐక్య సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక అతి పెద్ద కులంగా ఉన్నటు వంటి మాదిగ జాతిని పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఒకే వేదిక మీదకు తీసుకు వచ్చేఉద్దేశంతో సంఘం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసేంతవరకు మాదిగ, మాదిగ ఉపకులాలను కలుపుకొని నిరంతరం ఐకమత్యంతో పోరాటం చేస్తామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా గాదె సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బాస్కుల వెంకటయ్య, గుర్రం శ్రీను, కొడిశాల పరశురాములు, అరవింద్, శ్రావణ్, శివకుమార్, అఖిల్, నన్ని, అయిత అనిల్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జన్ను రాములు

# ఆఫీసర్లపై నజర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

- ప్రభుత్వ శాఖల యంత్రాంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిఘా
- ప్రభుత్వ అధికారుల పనితీరుపై ఇంటెలిజెన్స్ దృష్టి
- ప్రజలకు పారదర్శక పాలన అందించేందుకు కసరత్తు

ప్రభుత్వ శాఖల్లో అంతర్గత వ్యవహారాలపై ఇంటెలిజెన్స్ నజర్ వేసింది. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలనే లక్ష్యంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోంది. అయితే కొంతమంది అధికారులు వాటిపై పర్యవేక్షణ చేయకపోగా, అక్రమాలను ప్రోత్సహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మూడు నెలలుగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు జిల్లా, మండల స్థాయిలోని కీలక అధికారుల పనితీరుపై నిఘా వర్గాలు కూపీలాగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ ముగ్గురు ఐఏఎస్ అధికారులతో పాటుగా పొలిటికల్ పోస్టింగులతో సీట్లో కూర్చున్న ఖాకీలపై కూడా నిఘా పెట్టినట్లుగా సమాచారం. వీరితో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేసే కీలక శాఖలపైన ఎప్పటికప్పుడు సర్కారు చేతికి సమాచారం వెళ్లుతుండటంతో త్వరలోనే ఉమ్మడి జిల్లాలో భారీగా బదిలీలు జరిగే అవకాశం ఉందనే వార్తలు వినబడుతున్నాయి.

### కీలక శాఖలపై ఇంటెలిజెన్స్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ప్రజల్లోకి వెళుతోంది. అవినీతి, అక్రమాలు లేకుండా ప్రజలకు మెరుగైన పాలన అందించటంతో పాటు ప్రజల ఆర్థిక స్థితిని పెంచేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అయితే అవి ప్రజల్లోకి ఎంత వరకు వెళ్లుతున్నాయి..? వాటిని ప్రజలకు చేరవేసేందుకు అధికారులు ఎలాంటి కార్యక్రమాలు చేస్తున్నారు..? దళారుల ప్రమేయం ఏ మేరకు ఉంది..? తదితర వాటిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రధానంగా జిల్లా కలెక్టరేట్లతో పాటు గ్రేటర్ వరంగల్ కార్పొ రేషన్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్ సెల్‌లో ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి.. అధికారులు వాటి ని పరిష్కరిస్తున్నారా..? చెత్త కుప్పలోకి తోస్తున్నారా? అనే వాటిపైన నిఘా వర్గాల ద్వారా సర్కారు సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం. జిల్లాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే పాలనాధికారులు ప్రజా క్షేత్రంలో తిరుగుతున్నారా? లేదా? అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. వీటితోపాటు అన్ని జిల్లాల్లో డీఆర్‌డీఏలు, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, మునిసిపాలిటీలు, రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ, పోలీసు శాఖ, ఎక్సైజ్‌శాఖ, పౌరసరఫరాల శాఖ, ఆర్‌అండ్‌బీ, నీటి పారుదలశాఖ, మైనింగ్, రోడ్లు, ట్రాన్స్ పోర్టు, వైద్య, ఆరోగ్య శాఖ, వరంగల్ ఎంజీఎం, గనులు, సింగరేణి, సహకార శాఖతోపాటు తదితర శాఖలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లుగా సమాచారం. గత ఆగస్టు నెల నుంచి వివిధ శాఖల్లో అధికారుల పనితీరుపై నిఘా ఉంచినట్లుగా తెలిసింది.

రెండో రాజధానిగా వరంగల్ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో సీఎం ఆదేశాలతో ఇంటెలిజెన్స్ వర్గాలు ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేక నిఘా పెట్టినట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఎప్పటికప్పుడు అధికారుల పనితీరుపై సర్కారు చేతికి సమాచారం చేరుతుందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

### ఆ ముగ్గురి ఐఏఎస్‌లకి బదిలీ తప్పదా..?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు ఐఏఎస్‌ల తీరుపై ప్రభుత్వానికి ఫిర్యాదులు, ఆపై నివేదికలు కూడా అందినట్లుగా ప్రచారం జరుగుతోంది. గతంలో గ్రేటర్ వరంగల్ కమిషనర్‌గా పని చేసిన ఓ అధికారి పనితీరుపై ప్రభుత్వం అసంతృప్తిగా



ఉందని తెలుస్తోంది. కమిషనర్‌గా పని చేసిన కాలంలో ఆ అధికారి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు అనుమతులు ఇవ్వటమే కాకుండా, కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలను రెగ్యులరైజ్ చేసేలా తహసీల్దార్‌లపై ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు తెరపైకి వచ్చినట్లుగా సమాచారం. దీంతో ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సేకరించిన సమాచారం సీఎస్ వద్దకు చేరిన ట్లుగా తెలిసింది. ఈ విషయమై ఆ అధికారిపై అంతర్గతంగా విచారణ జరుగుతోందని సమాచారం. అంతే కాకుండా గతంలో జరిగిన ఎన్నికల్లో కీలకంగా ఉన్న సదరు అధికారి, ఎన్నికల ఫండ్‌ను కూడా పక్కదారి పట్టించారనే ప్రచారం జరుగుతోంది. వీరితోపాటు కీలక పోస్టులో ఉన్న మరో ఐఏఎస్ అధికారి తీరుపై కూడా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నట్లుగా సమాచారం. ఓ ప్రజాప్రతినిధితో కలిసి భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నేతలే పైఅధికారులకు ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం.

దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లుగా తెలిసింది. అలాగే ఉమ్మడి జిల్లాలోని ఓ కలెక్టర్ ప్రజాక్షేత్రంలోకి వెళ్లకుండా కేవలం క్యాంపు ఆఫీసు, కలెక్టరేట్‌కే పరిమితం అవుతున్నారని, ప్రభుత్వం ఆదేశిస్తే తప్పా. కాలు బయట పెట్టడం లేదని, గ్రీవెన్‌సెల్ ఫిర్యాదులు కూడా పట్టించుకోవటం లేదని నిఘా వర్గాల ద్వారా సర్కారుకు సమాచారం చేరినట్లుగా తెలిసింది. ఈ నెలఖారులోగా, లేదంటే జనవరిలో ఈ ముగ్గురిపై లేదా ఇద్దరిపైనైనా బదిలీ వేటు పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

### ప్రజలకు చేరువయ్యేందుకు కసరత్తు

ప్రభుత్వం తీసుకవస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజల చెంతకు పాలన తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇటీవల గురుకులాల్లో జరిగిన సంఘటనలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. అధికారులను అప్రమత్తం చేసి, గురుకులాల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అలాగే ప్రభుత్వం ఇస్తున్న 200యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు రుణ మాఫీ, సబ్సీడిపై రూ.500లకే గ్యాస్ తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలంటే క్రియాశీలకంగా పని చేసే అధికారులు ఉండాలని, అక్రమాలకు, అవినీతికి దూరంగా ఉండే వారిని కీలకశాఖల్లో నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది.

దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆయా శాఖల అధికారుల పనితీరు ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా సేకరించి, ఎప్పటికప్పుడు హైదరాబాద్ నుంచి ఆయా శాఖల పనితీరు మెరుగు పడేలా ఆదేశాలు ఇస్తున్నట్లుగా సమాచారం. ప్రజల కోసం పని చేసే అధికారులను కూడా గుర్తించి, వారిని మరింత ప్రోత్సహించాలని సర్కారు భావిస్తోందనే చర్చ ఉంది. నాలుగు నెలలుగా నిఘా వర్గాలు అనేక అంశాలను వెలుగులోకి తీసుకవచ్చి ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేస్తున్నారని, అందులో భాగంగానే కొంతమంది ఐఏఎస్‌లు, ఆయా శాఖల ఉన్నతాధికారుల పనితీరుపై కూడా నివేదికలు ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. మొత్తంగా ఈ నెలఖారు, లేదంటే జనవరిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కీలకశాఖల్లో బదిలీలు జరిగే అవకాశాలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

### ఆయా శాఖల పనితీరుపై నజర్

పైరవీలు, పొలిటికల్ ఒత్తిళ్లతో పోస్టింగులు కొట్టేసి.. సీట్లో కూర్చున్న అధికారులపై కూడా ఇంటెలిజెన్స్ వర్గాలు ఓ కన్నేసి ఉంచినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎవరెవరు ఏ శాఖలో.. ఎవరి పైరవీలతో పోస్టింగ్ తీసుకున్నారో సమాచారం సేకరించినట్లుగా తెలిసింది. వీరంతా పారదర్శకంగా పని చేస్తున్నారా..? ఒత్తిళ్లకు తలొగ్గి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారా? అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నట్లుగా సమాచారం. ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు పోలీసు పోస్టులను అంగట్లో సరుకు లెక్కనే మాయ చేశారనే ఆరోపణలపై నిఘా వర్గాలు ప్రభుత్వానికి నివేదికలు అందినట్లుగా సమాచారం. వరంగల్ ఈస్ట్ డివిజన్ పరిధిలో ఇద్దరు పోలీసు అధికారుల తీరుపైన ఆ శాఖ బాస్‌కు ఫిర్యాదులు వెళ్లినట్లుగా సమాచారం. వరంగల్, హనుమకొండ, ములుగు జిల్లాలో రెవెన్యూ శాఖలో కొంతమంది అధికారులపై అంతర్గత విచారణ జరుగుతున్నట్లుగా తెలిసింది. భూపాలపల్లి జిల్లాలో రెవెన్యూ శాఖలో రిటైర్డ్ అధికారులు పరోక్షంగా తిష్టవేసి అక్రమాలకు తెర తీస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. వీరికి ఆ శాఖలోని ఓ కీలక అధికారి వత్తాసు పలుకుతున్నట్లుగా తెలుస్తోంది. వరంగల్ కార్పొరేషన్‌లో టౌన్‌ప్లానింగ్, కూడా కార్యాలయంలో ఏళ్ల తరబడి తిష్టవేసిన అధికారుల తీరుపైన అంతర్గతంగా నిఘా వర్గాలు సమాచారం సేకరిస్తున్నట్లుగా తెలిసింది. కొంతమంది అధికారులకు నేరుగా హైదరాబాద్‌లోని సచివాలయంలోని కీలక అధికారులతో సత్సంబధాలు ఉన్నట్లుగా గుర్తించినట్లు తెలిసింది. గత ప్రభుత్వం కీలకంగా ఉన్న అధికారులతో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి..? అవిఎలాంటివి అనే కోణంలో కూడా ఆరా తీసినట్లుగా సమాచారం.

# క్రీడల్లో గెలుపోటములు సహజం

- రూరల్ సీఐ సర్వయ్య
- ముగిసిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు
- ప్రథమ స్థానంలో హైదరాబాద్, ద్వితీయ స్థానంలో సిద్దిపేట



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమని వాటిని క్రీడా స్ఫూర్తితో పాజిటివ్‌గా తీసుకోవాలని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 14న ప్రారంభమైన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ సర్వయ్య మాట్లాడుతూ...క్రీడలు మానసిక ప్రశాంతతో పాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. క్రీడాకారులకు మానుకోట ప్రాంతం ఎంతో పేరు గాంచిందన్నారు. జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించారని తెలిపారు. మానుకోట బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి 450 మంది క్రీడాకారులు పాల్గొనగా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అసోసియేషన్ బాధ్యులు సంజీవ, ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో హైదరాబాద్, ద్వితీయ స్థానంలో సిద్దిపేట, తృతీయస్థానంలో మహబూబాబాద్ జిల్లా జట్లు నిలువగా గెలుపొందిన జట్లకు కప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కృష్ణ, జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు పుష్పలీల, శ్రీనివాస్, కాశీనాథ్, శంకర్‌నాయక్, వెంకటేశ్వర్లు, సునీత తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణించి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి

- రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్, గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి
- కోలాహలంగా జిల్లాస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఖోఖో ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జంగా రాఘవరెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు కీర్తిప్రతిష్టలు తీసుకు రావాలని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవ వరెడ్డి సూచించారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జేఎన్ఎస్ ఖోఖో కోర్టులో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఖోఖో ఎంపిక పోటీలను జగా రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 9నుంచి 11వరకు వరంగల్ జిల్లా గీసుగొండ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించనున్న 57వ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ విభాగంలో నిర్వహించనున్న ఖోఖో చాంపియన్‌షిప్ పోటీల్లో ఆతిథ్య వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచి కప్ కైవసం చేసుకొని జిల్లాకు బహుమతిగా ఇవ్వాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల క్రీడలు, క్రీడాకారుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందని, సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, వారి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. జేఎన్ఎస్ లోని ఖోఖో కోర్టులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తానన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ - 2024 పోటీల్లో వరంగల్ జిల్లా అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో ట్రోఫీని సాధించి విజేతగా నిలవాలన్నారు. వరంగల్ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట శ్యాం మాట్లాడుతూ.. సీనియర్ విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో సుమారు 300మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్య దర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు శ్యామ ల పవన్‌కుమార్, ఖోఖో అసోసియేషన్ బాధ్యులు, డీఎస్ఏ ఖోఖో కోచ్ రమేష్, సీనియర్ ఖోఖో క్రీడాకారుడు బెజ్జం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీ లు సందడిగా ప్రారంభమయ్యాయి. ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన అండర్ 16, 18, 20, మెన్ అండ్ ఉమెన్ క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్య దర్శి కుదురుపాక సారంగపాణి ముఖ్య అతిథిగా హాజరై లాంచనంగా ప్రారం భించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. పట్టుదల క్రమశిక్షణతో సాధనచేస్తే అనుకున్న లక్ష్యా న్ని చేరుకోవచ్చన్నారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మూగల కుమార్ యా దవ్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీ ల్లో 100మంది అథ్లెట్లు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుంట్ల మండల కేం ద్రంలో నిర్వహించనున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీని యర్ ఫిజికల్ డైరెక్టర్ వాసుదేవరావు, రజనీకాంత్, బండి కృష్ణమూర్తి, డీఎస్ఏ అథ్లెటిక్స్ కోచ్ శ్రీమన్నారాయణ, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జనగామ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన జనగామ జిల్లాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తాటికొండ జగదీష్ (40) జిల్లా కేంద్రంలోని సురక్ష హాస్పిటల్ వద్ద ఈ నెల 14న యూటర్న్ తీసుకొని జనగామ చౌరస్తా వైపు వస్తున్న తరుణంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. గమనించిన స్థానికులు 108 ద్వారా జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమిం చడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఇద్దరికి తీవ్ర గాయాలు ..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బచ్చన్నపేటకు చెందిన సందెల అశ్విన్, అంజి అనే ఇద్దరు వ్యక్తులు ఆదివారం జనగామకు వస్తున్న తరుణంలో ఓబుల్ కేశ్వాపురం స్టేజి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేటి నుంచి కొమ్మాల మహోత్సవాలు

గీసుగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని ప్రఖ్యాతి గాంచిన కొమ్మాల శ్రీలక్ష్మి నరసిం హస్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసవ్రత మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో నాగేశ్వర్‌రావు, ధర్మకర్తల మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాసా చార్యులు తెలిపారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) వేడుకలు, 11న 108 కళశాలతో అమ్మవారికి నివేదన, 14న గోదారంగనాథుల కల్యాణం (బోగిపండుగ) ఘనంగా నిర్వహిస్తామని వివరించారు.

## హెచ్‌సీఏకు సుకుమార్ ఎంపిక



కాశిబుగ్గ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : హైద రాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) నిర్వహించే పోటీలకు వరంగల్ కాశిబుగ్గకు చెందిన ఓని సుకు మార్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన అండర్ -14 జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి హెచ్‌సీఏకు ఎంపికైన ట్లు తల్లిదండ్రులు శామంతి విజయ్ తెలిపారు. ఈ సందర్భంగా సుకుమార్‌ను డీవైఎస్‌వో సత్యవాణి, వరం గల్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, కోచ్ వై.సుమన్, చంద్రమోహన్, హరికుమార్ తదితరులు ఆదివారం అభినందించారు.

## కేయూ లైబ్రేరియన్ మృతి



కొండల్‌రెడ్డి (ఫైల్)

కేయూ క్యాంపస్ డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూని వర్సిటీ రిటైర్డు లైబ్రేరియన్ పి.కొండల్‌రెడ్డి(66) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. కొండల్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. కుమార్తెలు విదేశాల నుంచి రావాల్సి ఉండగా మంగళవారం హనుమకొండ వడ్డెపల్లిలోని కేయూ ఎంప్లాయిస్ కాలనీలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. కేయూ లైబ్రేరియన్‌గా, బీఎల్ ఐఎస్సీ అధ్యాపకులుగా వర్సిటీలో అందరికీ సుపరిచితులైన కొండల్‌రెడ్డి మృతి పట్ల వర్సిటీలో వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.

## ఫాతిమానగర్‌లో క్రిస్మస్ వేడుకలు

కాజీపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట ఫాతిమానగర్ ఆంథోని కళా క్షేత్రంలో ఆదివారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘ నంగా జరిగాయి. క్యాథలిక్, టీసీఎఫ్, ప్రొటెస్టంట్, సంఘాల సంయు క్తంగా జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా వేడుకల చైర్మన్ బిషప్ డానియేల్ కల్యాణపు, వరంగల్ క్యాథలిక్ బిషప్ కో-చైర్మన్ ఉడుముల బాల, వైస్ చైర్మన్ బిషప్ జాన్ మార్కండేయలు హాజరై క్రీస్తు జననం గూర్చి వివరించారు. కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బిషప్ దామెర ఐజాక్, ఫాదర్ తాటికొండ జోసఫ్, కాసు మర్రెడ్డి ఫాతిమాచర్చి ప్రెసిడెంట్ బొక్క దయాసాగర్, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


విద్యుత్ దీపాలతో వెలుగులీనుతున్న హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి

# క్రిస్మస్ జోష్

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రీ క్రిస్మస్ వేడుకలు
- రాత్రి నుంచి ఉదయం వరకు క్యారెల్స్ నిర్వహణ
- క్రిస్మస్ ట్రీ, స్టార్స్‌కు యమ డిమాండ్
- కిటకిటలాడుతున్న షాపింగ్ మాల్స్
- విద్యుత్ కాంతుల్లో ప్రార్థనాలయాలు

హనుమకొండ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో క్రిస్మస్ సందడి నెలకొంది. క్రిస్మస్ నిర్వహణకు క్రైస్తవ సంఘాలు సన్నద్ధమయ్యాయి. చర్చీలు విద్యుత్ దీపాల అలంకరణలతో వెలుగొందుతున్నాయి. క్రిస్మస్ క్రమంలో క్రైస్తవులు ప్రీ క్రిస్మస్ వేడుకల నిర్వహణలో నిమగ్నమయ్యారు. డిసెంబర్ 24 వరకు ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తారు. 26 నుంచి 31 వరకు పోస్ట్ క్రిస్మస్ వేడుకలను కూడా క్రైస్తవ సం ఘాలు నిర్వహిస్తాయి. మరోవైపు నగరంలోని షాపింగ్ మా ల్స్ కిటకిటలాడుతున్నాయి. ఈనెల 10వ తేదీ నుంచే ప్రీ క్రిస్మస్ వేడుకల ఆరంభం కావడంతో నగర నలుదిక్కులా క్రిస్మస్ పండుగ వాతావరణం సందడి చేస్తోంది.

### జోరుగా ప్రీ క్రిస్మస్ వేడుకలు

క్రిస్మస్ పండుగ డిసెంబర్ 25కు ముందే క్రైస్తవులు ప్రీ క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తారు. అంతే కాదు.. పండుగ తరువాత పోస్ట్ క్రిస్మస్ కార్యక్రమాలను కూడా జరుపుతారు. ఈనెల 10 నుంచే నగరంలో ప్రీ క్రిస్మస్ వేడ్యుకల్లో క్రైస్తవులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రీ క్రిస్మస్‌లో భాగంగా క్రైస్తవులు, ఆలయ సంఘాల ప్రతినిధులు అనేక సామాజిక కార్యక్రమాలను చేపడతారు. నిరుపేదలు, అనాథలకు వస్త్రాలు, సామగ్రి తదితరమైనవి సహాయం చేస్తారు. సెంట్రల్ జైలులోని ఖైదీలకు పండ్లు, మిఠాయిలను పంపిణీ చేస్తారు. ఆస్పత్రులకు సందర్శించి రోగులకు సహాయం చేయడం, ప్రార్థనలు నిర్వహిస్తారు. ఉమెన్స్ క్రిస్మస్, క్యాండిల్ లైట్ సర్వీస్, చర్చి ఎల్డర్స్ ఎంప్లాయిస్ క్రిస్మస్, రీచ్ క్రిస్మస్, క్రిస్మస్ కాంటటా-2024 వంటి కార్యక్రమాల నిర్వహణలో క్రైస్తవులు, సంఘం ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

### క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లు

క్రిస్మస్ పండుగ సమీపిస్తుండడంతో క్రైస్తవేతరులు కూడా వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. షాపింగ్ మాల్స్ స్టార్ హోటల్స్, నగరంలోని ప్రధాన కూడళ్లలో క్రిస్మస్ తాత (శాంటాక్లాజ్) బొమ్మలు, భారీ స్థాయి స్టార్స్ వంటి ఏర్పాటు చేస్తున్నారు. స్టార్ హోటల్స్ క్రిస్మస్ వేడుకలకు ముందే బుక్ అయ్యాయని యజమానులు చెబుతున్నారు.

### క్యారెల్స్‌తో ఇంటింటి సందర్శన

క్రిస్మస్ పండుగకు 15 రోజుల ముందు నుంచే క్రైస్తవ సంఘాలు క్యారెల్స్ నిర్వహిస్తాయి. ప్రతి రోజు రాత్రి 6 గంటల తరువాత క్యారెల్స్ బృందం పర్యటిస్తోంది. భక్తి గీతాలు, వాయిద్యాల హోరుతో క్రైస్తవుల ఇళ్లను సందర్శిస్తారు. హ్యాపీ క్రిస్మస్, మేరి క్రిస్మస్ నినాదాలతో ఇంటింటి సందర్శనలు జరుపుతారు. ప్రార్థనలు జరిపి క్రిస్మస్ శుభములు తెలియ్యా చేస్తారు. ఉదయం నాలుగు గంటల వరకు ప్రతీరోజు సంఘం ప్రతినిధులు, యువత, మహిళా విభాగం బృందాలు క్యారెల్స్‌లో పాల్గొంటాయి. నగరంలోని కాలనీల వారిగా ప్రణాళికలు రూపొందించుకొని క్యారెల్స్ ద్వారా క్రైస్తవుల ఇళ్లను సందర్శిస్తారు.

### క్రిస్మస్ ట్రీ, స్టార్స్‌కు భలే డిమాండ్

క్రీస్తు పుట్టుకను సూచించే నక్షత్ర నమూనాను క్రైస్తవులు పండుగకు కొద్ది రోజుల ముందు నుంచే ఇంటిపై ఏర్పాటు చేస్తారు. అదే విధంగా ఇళ్లలో, చర్చిల్లో క్రిస్మస్ ట్రీ తదితర అలంకరణలు చేస్తారు. పండుగకు నెల రోజుల ముందు నుంచే వీటి అమ్మకాలు ఊపందుకున్నాయి. మార్కెట్లో క్రిస్మస్ ట్రీ, స్టార్స్‌కు భలే డిమాండ్ ఏర్పడింది. స్టార్స్ రూ.150 నుంచి ఆపై ధరల్లో లభ్యమవుతున్నాయి. క్రిస్మస్ ట్రీలు అలంకరణలు ఇతరత్రా సామగ్రి విక్రయాలు జరుగుతున్నాయి.

క్రైస్తవులే కాకుండా షాపింగ్ మాల్స్ ఇతర షాపుల్లోనూ స్టార్స్ ట్రీ ప్రదర్శిస్తుండడంతో వాటికి డిమాండ్ పెరిగింది. బెలూన్స్ ఇతరత్రా అలంకరణ వస్తువులకు కూడా డిమాండ్ ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

### కేక్‌లకు ఆర్డర్లు

క్రిస్మస్ రోజున క్రైస్తవులు ఉత్సాహంగా కేక్‌ను కట్ చేస్తారు. దీనిని దృష్టిలో పెట్టుకొని బేకరీ యజమానులు ముందు నుంచే ఆర్డర్లు స్వీకరిస్తున్నారు. భారీ సైజులోని కేక్‌ల ఆర్డర్లు అధికంగానే ఉన్నాయంటున్నారు. షాపింగ్ మాల్స్ రెస్టారెంట్లు, హోటల్స్ వంటి నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయంటున్నారు. వీటిల్లో కూడా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తుండడంతో కేక్‌లకు గిరాకీ ఏర్పడిందని చెబుతున్నారు.

### కిటకిటలాడుతున్న షాపింగ్ మాల్స్

క్రిస్మస్ పండుగ క్రమంలో షాపింగ్ మాల్స్ ఇతర షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. బట్టల షాపులు, కంగన్‌హాల్స్, ఇలా ప్రతీ షాపులో సందడి నెలకొంది. పండుగ దృష్ట్యా దీపావళి ముగియగానే వెంటనే క్రిస్మస్ స్టాక్ తెప్పిస్తామని వ్యాపారులు చెబుతున్నారు.

డిసెంబర్ మొదటి వారం నుంచే వ్యాపారం ఊపందుకుందంటున్నారు.

### విద్యుత్ అలంకరణలో ఆలయాలు

క్రిస్మస్‌ను పురస్కరించుకొని నగరంలోని చర్చిలు సుందరంగా ముస్తాబవుతున్నాయి. విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. దేవాలయాలను ముస్తాబు చేయడంలో క్రైస్తవులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. బెలూన్స్, స్టార్స్ క్రిస్మస్ ట్రీలు, పెద్ద సైజుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక క్రిస్మస్‌కు ముందు, పండుగ రోజున దేవాలయాల్లో డ్రామాలు, సంగీత ప్రదర్శనలు నిర్వహిస్తారు. పిల్లల నుంచి పెద్దల వరకు వీటిలో పాల్గొన్యాటారు. డ్రామా ్యకోసం సెట్టింగ్‌లను ఏర్పాటు అవుతున్నాయి. ప్రతీరోజు రిహార్సల్‌తో చర్చిల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. 25న క్రిస్మస్ పండుగ ముగిసిన తరువాత కూడా 30వ తేదీ వరకు పోస్టు క్రిస్మస్ కార్యక్రమాలకు కూడా క్రైస్తవ సంఘాలు సన్నాహాలు చేస్తున్నాయి. సండే స్కూల్ క్రిస్మస్, యూత్, హెరిటేజ్ క్రిస్మస్ వేడుకలు జరుపుతారు.

### ప్రజాప్రతినిధుల సందర్శన

క్రిస్మస్ పండుగకు ముందు జరుగుతున్న ప్రీ క్రిస్మస్ వేడుకలకు ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు. నగరంలోని చర్చిలకు హాజరవుతున్నారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నారు. ఇటీవలే హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చిలో జరిగిన ఉమెన్స్ క్రిస్మస్ వేడుకలకు మంత్రి సీతక్కతో కలిసి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

క్రిస్మస్ కేక్ కట్ చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియచేశారు.

వరంగల్, హనుమకొండలోని పలు షాపుల్లో విక్రయిస్తున్న క్రిస్మస్ సామగ్రి



# సాంకేతిక సాగు..!

- వ్యవసాయంలో పెరుగుతున్న డ్రోన్ల వినియోగం
- కూలీల సమస్యకు పరిష్కారం
- సమయం.. డబ్బులు ఆదా
- ఆసక్తి చూపుతున్న రైతులు
- నిరుద్యోగులకు ఉపాధి మార్గం
- రుణం ఇచ్చేందుకు బ్యాంకులు రెడీ


మిరుప చేనులో డ్రోన్‌తో పురుగుల మందును పిచికారి చేస్తున్న దృశ్యం

వరంగల్ వ్యవసాయం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ వ్యవసాయం కొత్తపుంతలు తొక్కుతోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చేలా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తు న్నాయి. ఒకప్పుడు ఎకరం పత్తి పంట లో పురుగుల మందు పిచికారీ చేయాలంటే ఒక రోజు సమ యం తీసుకునేది. పిచికారీ చేసిన వ్యక్తు లు సొమ్మసిల్లి పడిపోయేవారు. వాసన పడకవాంతులు చేసుకునేవారు. అలాంటిది ఇప్పుడు డ్రోన్ల ద్వార కేవలం 15 నుంచి 20 నిమిషాల్లోనే పూర్తి చేస్తున్నారు. ఎకరానికి డ్రోన్ ద్వారా పిచికారీ చేసినందుకు రూ.500లు చార్జి వేస్తున్నారు. అంటే కూలీలతో పోలిస్తే ఇది చాలా చవక. పైగా సమయం ఆదా అవుతుంది. దీంతో రైతులు డ్రోన్‌లవైపే మొగ్గు చూపుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై డ్రోన్లను అందిచాలని కోరుతున్నారు.

### నమో డ్రోన్ దీదీ పథకం ద్వారా పంపిణీ

స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. 'నమో డ్రోన్ దీదీ' పథకం ద్వారా డ్రోన్లను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నది. ప్రయోగత్మకంగా గత మార్చి నెలలో హైదరాబాద్‌లో పది రోజుల పాటు మహిళా సంఘాల సభ్యులకు డ్రోన్ల నిర్వా హణ, తీరుతెన్నలపై శిక్షణ ఇచ్చింది.

### డ్రోన్ల వాడకంతో ప్రయోజనాలు

ఏ పంటకైనా ఎలాంటి పరిస్థితుల్లో అయినా త్వరితగతిన ఎరువులు పిచికారీ చేయవచ్చు. రైతులకు అదనపు వ్యయం తగ్గుతుంది. మహిళలకు, నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. డ్రోన్ల వాడకం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవు. రోజుకు పది నుంచి 20 ఎకరాలలో పురుగుమందులు పిచికారీ చేయొచ్చు.

### నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రోన్లను సబ్సిడీపై అందిం చినట్లయితే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. డ్రోన్ల తయారీ, నిర్వహణ, రేపేరు రంగాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ఒక్క డ్రోన్‌ను ఖరీదు చేయాలంటే దాని పని తీరు ఆధారంగా ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు ధర ఉం ది. గ్రామానికి ఒకటి లేదా వెయ్యి ఎకరాలకు ఒక యూనిట్‌గా చేసి ప్రభుత్వం సబ్సిడీపై డ్రోన్లను అందిస్తే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

### పది నిమిషాల్లో ఎకరం అయిపోయింది..



పంట చేనుల్లో పురుగుమందులు కలిపి పంపు కొట్టాలంటే కూ లీల కోసం రోజుల తరబడి ఎదురు చూసేవాళ్లం. వాళ్లు అడిగినంత ఇచ్చి పని చేయించుకునేటోళ్లం. ఎందుకంటే సమయం మించిపోతే పురుగు ఎక్కువై పంటంతా పాడు చేస్తుందని భయం. ఇప్పుడా భయం లేకుండా పోయింది. మా బాబు చెబితే ఎందో అనుకున్న కానీ.. మిరుప చేనులో పురుగుమందు పిచికారీ చేసిన తరువాత సంతోష పడ్డా.. ఎకరం కందిలో పిచికారి చేసేందుకు పళ్లు తోముకున్నంత సమయంలో పని అయిపోయింది.

వైనాల మొగిలి, రైతు, ఆత్మకూరు

### రాబోయేది డ్రోన్ల యుగమే..



ప్రస్తుతం వ్యవసాయంలో కూలీల కొరత ఎక్కువ. దాంతో పాటు ఖర్చు కూడా ఎక్కువే. ఈ సమస్యను అధిగమించడానికి ఆధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. పదిమంది కూలీలు రోజంతా చేసే పనిని ఒక యంత్రం ఒక గంటలో చేస్తుంది. ముఖ్యంగా పురుగుమందుల పిచికారీలో డ్రోన్ల వాడకం ఎంతో ఉపయోగకర మైనది. మేము డ్రోన్లను విక్రయించడంతో పాటు అద్దెకు కూడా ఇస్తున్నాం. డ్రోన్లతో పాటు వ్యవసాయానికి కావాల్సిన అన్ని రకాల పరికరాలను కూడా విక్రయిస్తున్నాం. ఏనుమాముల మార్కెట్‌లో మన అగ్రిటెక్ అందరికీ అందుబాటులో ఉంది. కావాల్సినవారు 88977 75537 నంబరులో సంప్రదించవచ్చు.

పాశికంటి రమేష్, మన అగ్రిటెక్ నిర్వాహకుడు

# నేటి నుంచి ధనుర్మాస వేడుకలు

- వైష్ణవ ఆలయాల్లో జోరుగా తిరుప్పావై
- నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు చేస్తున్న అర్చకులు



హనుమకొండ కల్చరల్/వరంగల్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆచారాలు, మాసాల్లో ధనుర్మాసానికి విశిష్ట స్థానం ఉంది. ఈ నెలలో నిర్వహించే తిరుప్పావై వ్రతానికి ప్రాధాన్యత ఇస్తారు. తిరుప్పావై అనేది ఒక గ్రంథం. కలియుగంలో మానవ కన్యగా జన్మించిన గోదాదేవి.. భగవంతుడిని భర్తగా భావించి ఆయనను చేపట్టడానికి సంకల్పించిన వ్రతమే తిరుప్పావై వ్రతం. ధనుర్మాసంలో ఈ వ్రతం నిర్వహిస్తుండటంతో ధనుర్మాస వ్రతంగా పేరు వచ్చింది. సం క్రాంతి పండుగకు ముందు 30 రోజుల కాలాన్ని ధనుర్మాసంగా వ్యవహ రిస్తుండగా, ఈ నెలంతా ఆల యాల్లో భవంతుడిని కొలవడంతో పాటు ఇళ్లల్లో సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ప్రధానంగా ఈ నెలలో శ్రీమహా విష్ణువును ప్రత్యేకంగా కొలుస్తారు. సౌరమానం ప్రకారం సూర్యుడు ధనస్సు రాశిలో ప్రవేశించిన రోజు నుంచి మకర రాశిలోకి ప్రవే శించే వరకు మధ్య కాలాన్ని ధనుర్మాసంగా వ్యవహరిస్తారు. ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మా సం ఉంటుంది. ఉదయం నుంచే ఆలయాల్లో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల పాటు జిల్లాలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, తిరుప్పావై ప్రవచనాలు, ధార్మిక సభలు నిర్వహిస్తారు.

నగరంలోని శ్రీగోదా రంగనాయక ఆలయంగా ప్రసిద్ధి గాంచిన రాగన్న దర్వాజలోని పెద్ద కోవెల, సీతారామచంద్రస్వామి ఆలయంగా ప్రసిద్ధి పొందిన చిన్న కోవెల, ఎక్సైజ్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, రెవెన్యూ కాలనీలోని రామాలయం, వికాస్ నగర్‌లోని రామాలయం, ఏకశిల పార్కు సమీపంలోని అభయాంజనేయ స్వామి ఆలయం, రెడ్డికాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం, వడ్డేపల్లి టీచర్స్‌కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయం, తదితర అనేక వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస వేడుకలు పెద్ద ఎత్తున జరుగనున్నాయి.

వరంగల్ బట్టల బజార్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం, గీతాభవన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎల్లంబజార్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయం, డాక్టర్స్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, శివనగర్‌లోని రామాలయం, ఉమ్మడి జిల్లాలో వైష్ణవ దేవాలయాల్లో ధనుర్మాసోత్సవం వైభవంగా నిర్వహిస్తారు.

ప్రతీ రోజు గోదాదేవి అమ్మవారిని కీర్తిస్తూ తిరుప్పావై పాశురాలను (తమిళ పద్యాలు) రోజుకొక్కటి చొప్పున అనుసంధానం చేస్తూ అర్చకులు ప్రవచనాలు వింటూ ముఖ్యంగా మహిళలు నియమ నిష్ఠలతో ధనుర్మాస వ్రతాన్ని నిర్వహిస్తారు.

రెడ్డి కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సముద్రాల శఠగోపాచార్య, ఏ టు జడ్ వెంకటేశ్వరాలయంలో ముడుంబై నర్సింహ రంగాచార్య, వెంకటేశ్వరాలయంలో సముద్రాల పురుషోత్త మాచార్య, చిన్న కోవెలలో ఆళ్వార్ స్వామి, తిరుప్పావై ధార్మిక ప్రవచనాలు నిర్వహించనున్నారు.


మట్టిలో కూరుకు పోతున్న త్రికూటాలయం



# ఆపదలో కాకతీయుల సంపద

- కనుమరుగవుతున్న పురాతన దేవాలయాలు
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- అమలు కాని రాజకీయ నాయకుల హామీలు


మట్టిలో కూరుకుపోతున్న నేలశంభుని దేవాలయం.

ఖిలా వరంగల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కళా సంపద ఆపదలో పడింది. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కాకతీయుల కట్టడాలు, శిల్పసంపద దేవతా విగ్రహాలు రోజురోజుకూ కాలగర్భంలో కలుస్తు న్నాయి. వాటి పునరుద్ధరణ విషయంలో రాజకీయ నాయ కులు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కావడంలేదు. మధ్యకోటలోని ఆంజనేయ స్వామి దేవాలయం, నేలశం భుని గుడి, వేంకటేశ్వరస్వామి దేవాలయం, చిన్నగుడి, మండుగది, దీపగడ్డ, వరాలమ్మదేవాలయం, శివాలయం, గుట్ట పై రామాలయం, మండాలమ్మ గుడి, జంగమయమయ్య దేవాలయం, కొండగుడి, త్రికూటాలయం, ఏకశిల గుట్ట, గుర్రపుశాల పర్యాటకుల ఆదరణకు నోచుకోవడంలేదు. కేవలం స్వయంభూ-శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో మాత్రమే పూజలు జరుగుతున్నాయి. మధ్యకోటలో సుమా రు 14 నుంచి 20 దేవాలయాలు ఉన్నాయని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను కేటాయించి పర్యాటకులు దర్శించు కునేలా వాటిని అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


### గుప్తనిధుల కోసం తవ్వకాలు


కాకతీయ రాజుల కాలంలో బంగారానికి కొదువలేదని చరిత్రలో ఉంది. వారు బంగారంతో కిరీటం, వడ్డాణం, కాళ్ల పట్టీలతో పాటు ఏడు వారాల నగలు చేయించుకునేవారని, వారి తదనంతరం పూర్వీకులు ఆభరణాలను ఆలయాల్లో విగ్రహాల కింద పెట్టారని ప్రచారంలో ఉంది. దీంతో కొంద రు దుండగులు బంగారం కోసం ఆలయాల్లో విగ్రహాలను పడగొట్టారు. పలు ఆలయాలను ధ్వంసం చేశారు. ఇప్పటికైనా పురావస్తు శాఖ అధికారులు స్పందించి కోటలోని దేవాలయాలలో దేవతా విగ్రహాలను పునరుద్ధరించి ఆలయాలకు పూర్వ వైభవం తేవాలని జిల్లా ప్రజలు వేడుకుంటున్నారు.

### కాలగర్భంలో కలుస్తున్న ఆలయాలు

రాతికోట పక్కన కాకతీయ రాజులు నిర్మించిన నేలశంభుని దేవాలయం, తూర్పుదిక్కున మట్టికోట సమీపంలో త్రికూటాలయం, సింగారపు బావి, కరీమాబాద్, ఉర్సులలో దిగుడు బావి(మెట్ల బావులు)తో పాటు పలు దేవాలయాలు కాలగర్భంలో కలుస్తున్నాయి. వాటిని వెలికి తీసి పర్యాటకులకు అందించాల్సిన అవసరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.




శిథిలావస్థలో ఉన్న కొండగుడి


మధ్యకోటలో ఆదరణకు నోచుకోని దేవాలయం

## నందీశ్వరా ఏమిటీ దుస్థితి ?

- ముళ్లపొదల్లో నంది విగ్రహాలు
- పట్టించుకోని పురావస్తు శాఖ అధికారులు
- పునరుద్ధరించాలని కోరుతున్న ప్రజలు

ఖిలా వరంగల్ (ఆంధ్రజ్యోతి): పరమశివుడి వాహనం నందీశ్వరుడు. మానవులు తమ కష్టాలను నందీశ్వరుడి చెవిలో చెబితే నంది పరమశివుడికి చెబుతుందని ప్రజల విశ్వాసం. కాకతీయ రాజులు శైవభక్తులు. వారి కాలంలో శివాలయాలను ఎక్కువగా నిర్మించారు. ముఖ్యంగా ఖిలావరంగల్‌లో రాళ్లపై అనేక నందీశ్వరులను చెక్కించారు.

వారి అనంతరం ముస్లిం రాజులు వాటిని ధ్వంసం చేశారు. మధ్యకోటలోని స్వయంభూదేవాలయంలో గతంలో అయిదు నందులు ఉండేవి. వాటిలో మంచిగా ఉన్న వాటిని ఖుష్‌మహల్ మ్యూజియం, ఏకశిల పిల్లల పార్కులో, స్వయంభూ దేవాలయంలో ప్రతిష్ఠించారు. మిగతా విగ్రహాలకు ముఖాలు, తల, మొండెం, కాళ్లు, చెవి, తోక తదితర శరీరభాగాలు తెగిపడి ఉండడంతో వాటిని దేవాలయాలలో ప్రతిష్ఠించలేదు. దీంతో అవి పూజలకు నోచుకోక వెలవెలబోతున్నాయి. ఇప్పటికైనా పురావస్తు శాఖ అధికారులు స్పందించి నంది విగ్రహాలకు మరమ్మతులు చేయించి పూర్వ రూపాన్ని తీసుకొచ్చి, భక్తులు పూజించేలా ఏర్పాట్లు చేయాలని పర్యాటక ప్రేమికులు, నగర ప్రజలు కోరుతున్నారు.


మధ్యకోటలోని స్వయంభూ దేవాలయంలో కాలు, చెవి విరిగి ఉన్న నంది విగ్రహం


దేవాలయం పరిసరాల్లో విరిగి ఉన్న నందీశ్వర విగ్రహాలు

# అధ్వానంగా అంతర్గత రహదారులు

**● గుంతలమయమైన రోడ్డు, లో లెవల్ కల్వర్టులు ● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు, పాలకులు**



మల్కాపూర్ నుంచి కొత్తపల్లెకు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న లోలెవల్ కల్వర్టు

చిలుపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం రూ.కోట్లు వెచ్చిస్తున్నా క్షేత్రస్థాయిలో అవి బాగు పడడం లేదు. కంకరతేలి, గుంతలమయమై అధ్వాన్నంగా తయారయ్యాయి. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పల్లగుట్టకు వెళ్ళే రోడ్లు, లోలెవల్ కల్వర్టులు గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా మండలంలోని మల్కాపూర్ నుంచి కొత్తపల్లెకు వెళ్ళే మార్గంలో లో లెవల్ వంతెన సహా రోడ్డు గుంతలమయం కావడంతో పల్లెవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. మల్కాపూర్ నుంచి లింగంపల్లి వెళ్ళే మార్గంలో ఉన్న కంకరతేలి ప్రమాదకరంగా మారింది. ఇదే రోడ్డును ఆనుకుని మల్కాపూర్ క్లస్టర్‌కు సంబంధించిన రైతువేదిక, పల్లెప్రకృతివనం, నర్సరీని నిర్మించారు. నిత్యం వందలాది మంది రైతులు, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తారు. కొండాపూర్ నుంచి వేలేరు మండలంలోని పీచరకు వెళ్ళే మార్గంలో ఇండేన్ గ్యాస్ కంపనీ ఉంది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ప్రయాణ రాకపోకలు సాగిస్తుం టారు. రోడ్డంతా గుంతలమయం కావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

### పీఆర్ ఇంజనీర్ల నిర్లక్ష్యం

రోడ్ల నిర్మాణంలో పీఆర్ ఇంజనీర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. పల్లగుట్ట - చిలుపూర్ వెళ్ళే మార్గంలో మారెపల్లి గూడెం దగ్గర ఇటీవల నిర్మించిన లోలెవల్ కల్వర్టును రూ 13 లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం అది వినియోగంలోకి రాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పాత దారిగుండానే ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వెంకటాద్రిపేట నుంచి హనుమకొండ జిల్లా వేలేరు మండలం లోని గుండ్లసాగరం వెళ్ళే మార్గంలో బీటీరోడ్డు నిర్మాణం కోసం కంకర పోసి వదిలేశారు. పనులు పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ పత్తా లేక రెండేళ్ళవుతోంది. ఈ సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన బీటీ రోడ్ల నిర్మాణంతో పాటు, ప్రస్తుతం దెబ్బతిన బీటీరోడ్ల స్థానంలో రెన్యువల్ పనులను చేపట్టేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న పల్లగుట్ట, గుండ్లసాగరం రోడ్లు

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

బచ్చన్నపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలకు పలువురు సామాజిక సేవకులు, రాజకీయ పార్టీల నేతలు ఆర్థిక సహాయాలు అందించారు. కొన్నె గ్రామంలో పిట్టల చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందగా సామాజిక సేవకులు కోడూరు శివకుమార్‌గౌడ్ రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. పడమటికేశ్వాపూర్ గ్రామంలో గిద్దెల పోచమ్మ అనే మహిళ మృతి చెందగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జంగిటి విద్యానాథ్ రూ. 5 వేలు ఆర్థిక సహాయం అందించారు. అలాగే బండనాగారం గ్రామంలో ఇటీవల ఇజ్జగిరి నర్సయ్య అనే వ్యక్తి మృతి చెందగా మాజీ ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి కృష్ణంరాజు రూ. 3 వేలు, మాజీ సర్పంచ్‌లు కొప్పురపు శ్రీలత శ్రీనివాస్‌రెడ్డి రూ. 2 వేలు, శివరాత్రి కవిత రాజనర్సయ్యలు రూ. 2 వేలు ఆర్థిక సహాయాలు అందించి అండగా నిలిచారు. కార్యక్రమాలు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి చేయూత

పాలకుర్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రానికి చెందిన కన్నెబోయిన రమేష్ ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. పాలకుర్తి జెడ్పీఉన్నత పాఠశాలలో 2001- 2002 సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న మిత్రులు మృతుడు రమేష్ కుటుంబానికి రూ. 61, 301 వేలను కూతురు భాన్వీ పేరిట పోస్టాఫీసులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను ఆదివారం అందచేశారు. చిదురాల రాజు, రహే మాన్, గోవర్ధన్, రేగుల పర్శరాములు, గోపి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఝాన్సీరెడ్డి పరామర్శ



శ్రీకాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు చింత శ్రీకాంత్ ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులను ఆదివారం పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఓదార్చి, పరామర్శించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు లకావత్ లక్షీనారాయణ నాయక్, విజయడైరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు తోటకూరి పాండు కృష్ణ, ధరావత్ రాజేష్, జక్కుల గంగరాజు, నడిదే చల్మారెడ్డి, పులిగిళ్ల వెంకన్న. నీమా నాయక్, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామం మీదుగా వెళ్లే పలు రోడ్లను మరమ్మతులు చేయాలని కోరుతూ మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన యువజన సంఘాల నాయకులు ఆదివారం గ్రామంకు వచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతి పత్రం అందించారు. వినతి పత్రం పరిశీలించిన కడియం గోవర్ధనగిరి నుంచి చిలుపూర్ మండల కేంద్రానికి డబుల్ రోడ్డు మంజూరి అయ్యిందని త్వరలోనే టెండర్‌లు పిలిచి పనులు అప్పగించడం జరుగుతుందన్నారు. మీదికొండ నుంచి గిద్దెబండతండా మీదుగా తాటికొండకు వెళ్లే రోడ్డు అభివృద్ధి విషయమై పరిశీలిస్తానని, గృహాల మీదుగా వెళ్లిన 11 కేవీ వైర్ల మార్పు విషయమై అధికారులకు సూచించి పరిష్కార మార్గం చూస్తానని, రాఘవపూర్-ఆశ్వరావుపల్లి బీటీ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూస్తానని తెలిపారు. కడియం వెంటనే స్పందించడం పట్ల యువకులు హర్షంవ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరు మధు, శాగ నాగరాజు, శివ పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



పడి పూజలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

జఫర్‌గఢ్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : స్వామియే శరణం అయ్యప్పా.. భగవాన్ శరణం.. భగవతి శరణం.. శరణం శరణం అయ్యప్ప.. అంటూ మాలధారుల శరణుఘోషతో జఫర్‌గఢ్ మండలం తమ్మడపల్లి(జి) మార్మోగింది. అయ్యప్ప భక్తులంతా కలిసి ఆదివారం తమ్మడపల్లి(జి)లో స్థానిక బొడ్రాయి వద్ద అయ్యప్ప మహాపడిపూజను వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన గురు స్వాములతో పాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి, సిహెచ్.కృష్ణమూర్తి, దామోదర్, నరెందర్‌రెడ్డి, మారపల్లి రవి, దొంతూరి రవి, పాక చిరంజీవి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కురుమ భవన ప్రారంభానికి ఆహ్వానం అందలేదు

**-దొడ్డి కొమురయ్య వారసులు దొడ్డి భిక్షపతి, దొడ్డిచంద్రం**

దేవరుప్పుల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోకాపేటలో శనివారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమర వీరుడు దొడ్డికొమురయ్య కురుమ భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య వారసులు భిక్షపతి, చంద్రం మాట్లాడుతూ తమ కుటుంబసభ్యులెవరికీ కురుమ సంఘ ప్రతినిధులనుంచి ఆహ్వానం అందలేని ఆవేదన చెందుతున్నారు. తమకు ఆహ్వానం అందకుండా కురుమపెద్దలు కుట్ర చేశారన్నారు. రాష్ట్ర రాజధానిలో మా తాత కొమురయ్య పేర పెద్ద భవనం నిర్మించి ప్రారంభించి మమ్మల్ని పిలువకుండా అవమానపర్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

## జాతీయ సమైక్యత స్ఫూర్తి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్



పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత స్ఫూర్తి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 75వ వర్ధంతి సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్‌గౌడ్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా వేడుకలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి, నాయకులు వల్లభాయ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిచారు. ఈ సందర్భంగా దశమంత్‌రెడ్డి మాట్లాడుతూ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నిజాం ప్రభుత్వాన్ని మెడలు వంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించిన గోప్ప నాయకుడని కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఎనలేని కృషి చేశారని, భారతదేశ అభివృద్ధికి ఆయన ఆలోచనలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మహంకాళి హరిశ్చంద్రగుప్త, శివరాజ్ యాదవ్, కొంతం శ్రీనివాస్, ఉడుగుల రమేశ్, కత్తుల లక్ష్మి, కోట వినోద్ పాల్గొన్నారు.

రైతు భరోసా డబ్బులు

## ఖాతాల్లో జమ చేయాలి

రఘునాథపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): యాసంగి సీజ న్‌లో అయినా పెట్టుబడి సాయం కింద రైతు భరోసా డబ్బులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సిహెచ్. రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీమన్నారయణపురం గ్రామంలో ఆదివారం చేపట్టిన సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి సంవత్సరం గడిచిందని తెలిపారు. ఇప్పటి వరకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడానికి అధికారులు అంకిత భావంతో కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి, తూడి రేణుబాబు, శ్రీనివాస్, హన్మాజీ, బిక్షపతి, అంజనేయులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న రాజారెడ్డి తదితరులు

## నగదు బదిలీ చేసే వరకు వదిలిపెట్టం



జీవాల వద్ద కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే గొల్ల కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా రూ 2లక్షల నగదు బదిలీ చేస్తామని నేటికి అతిగతీ లేదని నగదు బదిలీ చేసే వరకు ప్రభుత్వాన్ని వదిలీ పెట్టబోమని జీఎంపీఎస్ మండలాధ్యక్షుడు మేకల మల్లేషం తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు జరిగి ఏడాది కావస్తున్న నగదు బదిలీ చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 19న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద చేబట్టనున్న ధర్నా కర పత్రాలను వినూత్నంగా జీవాల వద్దకు వచ్చి నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గొర్రెల యూనిట్‌ల పేరుతో కాపర్లు అప్పులు తెచ్చి డీడీలు తీసిన యూనిట్లు రాలేదన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల కాలంలో యూనిట్లకు సంబంధించిన నగదు బదిలీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కావస్తున్న అందించకుండా మోసం చేస్తుందన్నారు. ప్రభుత్వ మోసాన్ని నిరసిస్తూ చేబట్టిన ధర్నాకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీఎంపీఎస్, నాయకులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న ఆర్య వైశ్య సంఘం జిల్లా నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అమర జీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరం, చిరస్మరణీయమని ఆర్య వైశ్య మహాసభ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక శివునిపల్లి పట్టణంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో ఆంధ్ర రాష్ట్ర అవరతరణ కోసం 58 రోజులు ఆమరణ దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహనీయుడన్నారు. అమరజీవి పోరాట పటిమను ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరు పేదలను ఆదుకునేందుకు విరివిగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ ఉప గవర్నర్ తెల్లాకుల రామకృష్ణ, మండల అధ్యక్షుడు ఎస్.వెంకట్రాంనర్సయ్య, యంజాల ప్రభాకర్ పాల్గొన్నారు.

## సంఘటితంతోనే సమస్యల సాధన సాధ్యం



కార్మికులకు సూచనలు ఇస్తున్న అధ్యక్షుడు కామల్ల అయిలన్న

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 15: భవన నిర్మాణ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సంఘటితమైతేనే కార్మికుల సమస్యలను సాధించుకోగలమని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం (బీఎన్ఆర్‌కేఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల అయిలన్న తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి కార్మిక సంఘాల నాయకులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రధాని దగ్గర నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు కార్మికులు నిర్మిస్తున్న గృహాల్లోనే ఉంటున్నప్పటికి కార్మికుల కష్టాలను మాత్రం ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల కార్మికులకు అందిస్తున్న విధంగా గుర్తింపు పొందిన కార్మికులకు పెన్షన్ సదుపాయం కల్పించా లని, ప్రమాదవశాత్తు మరణించే కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ 10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు అనుసరించాల్సిన విధి విధానాలపై వారికి అవగాహన కల్పించారు. పలు యోగాసనాల పైన శిక్షణ అందించారు. సంఘం రాష్ట్ర కోశాధికారి తాటికొండ మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సాయికుమార్, వేములకొండ సంపత్, గోనెల ఐలోని, కుమారస్వామి, వాతల యాదగిరి, నరసింహులు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు దేవాదుల కెనాల్ పనులకు మోక్షం

**ఎమ్మెల్యే కడియం చొరవతో మొదలైన కాలువ తవ్వకాలు**



కాలువ పనులను ప్రారంభిస్తున్న మాజీ జడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి

లింగాలఘణపురం, డిసెంబర్15(ఆంధ్రజ్యోతి): గోదావరి సాగునీటి కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్న రైతాంగానికి హామీ ఇచ్చిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన మాటను నిలబెట్టుకునేందుకు అడుగు ముందుకు వేశారు. దేవాదుల కాలువ నిర్మాణం కోసం పూర్తి స్థాయిలో భూసేకరణ చేపట్టినప్పటికీ నెల్లుట్ల వద్ద మాజోజు హరిప్రసాద్ అనే రైతు తన భూమిని ప్రభుత్వానికి ఇవ్వడానికి నిరాకరించాడు. దీంతో అశ్వరావుపల్లి కుడికాలువ నిర్మాణ పనులకు బాటిల్ నెక్ సమస్య కారణంగా నాలుగేళ్లుగా అడ్డంకిగా మారింది. కాలువ పనులను పూర్తి చేసేందుకు అప్పటి కలెక్టర్ శివలింగయ్యతో సహా జిల్లా స్థాయి అధికారులు సదరు రైతును ఒప్పించే ప్రయత్నం చేసినా వినకపోవడంతో దేవాదుల కాలువ పనులు నిలిచిపోయాయి. దీంతో అశ్వరావుపల్లి కుడి కాలువ ద్వారా ప్రధానంగా లింగాలఘణపురం మండలం లింగాలఘణపురం, నాగారం, గుమ్మడవెల్లి, జీడికల్, రామచంద్రగూడెం, కళ్లెం, సిరిపురం, మాణిక్యాపురం గ్రామాల చెరువులను గోదావరి జలాలతో నింపే అవకాశం లేకుండాపోయింది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి భూనిర్వాసితుడు హరిప్ర సాద్‌ను కలిసి గోదావరి జలాలతో చెరువులను నింపేందుకు భూసేకరణకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం డబ్బులు త్వరితగతిన వచ్చేందుకు చర్యలు తీసకుంటానని అంతేకాకుండా తన సొంతంగా రూ. 50వేలు అదనంగా ఇస్తానని రైతు హరిప్రసాద్‌ను ఒప్పించారు. దీనికి తోడు స్థానిక తాజా మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి ఎమ్మెల్యే కడియం శ్రీహరిని స్ఫూర్తిగా తీసుకుని సదరు రైతుకు తనవంతుగా రూ. 50వేలు చొప్పున ఇద్దరు కలిసి రూ. 1లక్ష చెల్లించడంతో ఎట్టకేలకు భూసేకరణకు మార్గం సుగమమైంది. దీంతో ఆదివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాలతో మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్‌లు కొబ్బరికాయలు కొట్టి కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## నేటి నుంచి సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడలు

జనగామ కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 టోర్నమెంటులో భాగంగా ఈ నెల 16 నుంచి జిల్లా స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 21 వరకు జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి క్రీడా పోటీలు నిర్వహించబడతాయని ఆయన పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

బచ్చన్నపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్ వెనుకాల ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పాడి ఆవు విద్యుద్ఘాతానికి గురై మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు ఆముదాల భూపాలరెడ్డికి చెందిన రూ. 80 వేల విలువ చేసే పాడి ఆవు మేత కోసం వెళుతూ, ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తక్కువలో ఉండడంతో వైర్లు తగిలి మృతి చెందింది. విద్యుత్, పశువైద్యాధికారులు వచ్చి పంచనామా నిర్వహించారు. బాధిత రైతుకు పరిహారం అందేలా అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని పలువురు రైతులు, నాయకులు కోరారు.

## నేటి నుంచి ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పవిత్ర ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభం అవుతున్న దృష్ట్యా వైష్ణవాలయాల్లో ప్రత్యేక ఉత్సవాల నిర్వహణ చేపట్టనున్నట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లోని శ్రీ తిరుమల నాథ స్వామి దేవాలయం, శ్రీ వేంకటేశ్వరాలయంలో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, తిరుప్పావై పాశురాల పఠనం నిర్వహిస్తామని ఆలయ బాధ్యుల కలకోట రంగాచారి, రాము, శేషాచారి, యాద శ్రీనివాస్ తెలిపారు.

## పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

దేవరుప్పుల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి కుటుస్థులు అన్ని రంగాల్లో రాణించడంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జనగామ జిల్లా ప్రచారకార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం దేవరుప్పులలో ఆయన మాట్లాడుతూ పద్మశాలి కులస్థులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణా రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సికిందరాబాద్‌లోని హరిహర కళాభవనంలో ఈ నెల 17న జరుగుతుందన్నారు. పద్మశాలీలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## నాలుగో తరగతి ఉద్యోగుల కమిటీ ఎన్నిక

కొడకండ్ల డిసెంబర్15 (ఆంధ్రజ్యోతి): నాలుగో తరగతి ఉద్యోగుల కొడకండ్ల యూనిట్ కమిటీ ఎన్నిక నిర్వహించనట్లు ఎన్నికల పరిశీలకులు సత్తయ్య తెలిపారు. మండలకేంద్రంలో ఆదివారం కొడకండ్ల యూనిట్‌కు చెందిన కొడకండ్ల, దేవరుప్పుల, పాలకుర్తి మండలాల కమిటీ కోసం ఎన్నికలు నిర్వహి ంచారు. సీహెచ్ నవీన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అసోసియేట్ అధ్యక్షుడిగా బి.యాదయ్య, ఉపాధ్యక్షులుగా బి.వెంకటయ్య ఈ సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా టి.సీతారామంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికైన ట్లు తెలిపారు. ఈ ఎన్నికలో నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు

## జిల్లాస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలి

కొడకండ్ల డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17 న మండలకేంద్రంలోని గౌడసొసైటీ హాల్‌లో నిర్వహించనున్న గౌడ జనహక్కుల పోరాటసమితి జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్మెట శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో ఆదివారం సన్నాహక సమావేశంతోపాటు మండలకమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కమిటీ అధ్యక్షుడిగా దండెంపెల్లి సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎరుకల సైదులు, కోశాధికారిగా నిమ్మల మహేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గౌడకులస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకులు

లింగాలఘణపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో ఆదివారం తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలుగు రైతు విభాగం రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి జనగామ వృకోధర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్ర మంలో టీడీపీ సాంస్కృతిక విభాగం మాజీ కన్వీనర్ బర్ల గిరిబాబు, మైనార్టీ నాయకుడు యాకూబ్, బర్ల శ్రీశైలం, గ్రామశాఖ అధ్యక్షులు మూటకోరు శ్రీనివాస్, సందెన భిక్షపతి, సోమరాజు, బస్వగాని మల్లేశం పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులకు, ఉద్యోగులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఇ.ఇంద్రసేనా రెడ్డి, వి.కొంరెల్లి, డిమాండ్ చేశారు. ఆదివారం వారు స్టేషన్ ఘన్‌పూర్‌లో మాట్లాడారు. ఉద్యోగి తన సర్వీస్‌లు నెల నెలా దాచుకున్న డబ్బులు వెంటనే ఇవ్వకుండా జాప్యం చేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

దేవరుప్పుల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దతండాకు చెందిన గుగులోతు నరేందర్ ఆదివారం గుండెపోటుతో మరణించగా పీసీసీ సభ్యులు లకావత్ లక్షీనారాయణ ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు రాజేష్ నాయక్, పులిగిళ్ల వెంకన్న నల్ల సత్యనారాయణ, లొడంగి అశోక్ పాల్గొన్నారు.

## జీఎంపీఎస్ ధర్నాను జయప్రదం చేయాలి

చిలుపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గొల్లకురుమల సమస్యలపై ఈ నెల 19న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద నిర్వహించే జీఎంపీఎస్ (గొర్రెల మేకల పెంపకందార్ల సంఘం) ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సాదం రమేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. దళారుల ప్రమేయం లేకుండా గొల్లకురుమలందరికీ రూ 2 లక్షలను గొర్రెల కొనుగోలు కోసం అందజేయడంతో పాటు, ఇన్సూరెన్స్ డబ్బులను సైతం ప్రభుత్వమే చెల్లించాలన్న తదితర సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో భాగంగా చేపడుతున్న ధర్నాకు పెద్దఎత్తున గొల్లకురుమలు తరలిరావాలని కోరారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



జఫర్‌గఢ్ హైస్కూల్‌లో నిర్వహించిన సమ్మేళనంలో 2007-08 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

జఫర్‌గఢ్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : జఫర్‌గఢ్ మండల కేంద్రంలో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 2007-2008 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులంతా ఒక్క చోటకు చేరి.. ఆత్మీయ అలింగనాల అనంతరం యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు.. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. పూర్వ విద్యార్థులచే పాఠశాల ఆవరణ సందడిగా మారింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పుట్టిన ఊరు, చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనందిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు.